# నాగదోషం

జి. ఉషావిశాల



"తమ జాతకంలో నాగదోషం ఉందాది, దొరా. తమరు పాముని చంపరాదు. ఎవరైనా చంపుతుంటే చూడనుకూడా రాదు. . ." లలితకి కొండ దొర మాటలు జ్ఞాపకానికి వచ్చి కెవ్వున కేక వేసింది. చచ్చిన పాముని కర్రకి తగిలించడానికి ప్రయత్నిస్తున్న శేఖరం భార్య వెర్రికేకకి ఉలిక్కిపడి వెనక్కి ఒక్క గంతు వేసి, భయంతో బిర్రుగా కంపిస్తున్న భార్యని చూసి, "ఏమిటి? ఏమైంది?" అన్నాడు గాభరాగా.

లలిత కంపిస్తున్న కంఠంతో "నువ్వు. . . నువ్వెందుకు చంపావు?" అంది. "నీ జాతకంలో నాగదోషం ఉంది. నువ్వు పాముని చంపకూడదు. పాము శాపం పెడుతుంది" అని పైకి అనలేక పోయింది. ఆమె పిహెచ్. డి. పరిజ్ఞానం ఆ మాటల్ని ఆమె కంఠంలోనే నొక్కినా, ఆ మాటలు ఆమె మనసులో సుళ్ళు తిరుగుతున్నాయి.

"చంపావులే. ఇంకా పాము సరిగ్గా చావలేదేమో! కదులుతోందేమో! చూసి కేక వేశా ననుకున్నాను. నేను చంపకపోతే ఎవర్నయినా కేక వేసేదాకా పాము ఇక్కడ కూర్చుంటుం దనుకుంటున్నా వేమిటి? ఎర మింగడం చేత నా చేతికి దొరికింది కానీ, లేకపోతే కంటి రెప్ప ఆర్పేలోపల మాయమై పోతుంది."

లలిత కేక విన్న నౌకరు రంగయ్య లోపలినుండి పరిగెత్తుకు వచ్చి, "బాబుగారూ. . .?" అన్నాడు.

"ఆఁ రంగయ్యా. ఇదిగో, ఈ మల్లె పొద దగ్గర పాము కనిపించిందోయ్. చంపేశా ననుకో. రేపు ఎవరి చేతనైనా ఈ పొద కత్తిరింపించు. కిష్టయ్య పని మానేసిన దగ్గర నుంచీ ఈ చెట్లన్నీ అడవి లాగ పెరిగిపోతున్నాయి. అసలు కిష్టయ్య మళ్ళీ పనిలోకి వస్తాడో, రాడో కనుక్కో. అతను రానని ఖచ్చితంగా చెప్పేస్తే మనం మరో మనిషి నెవరినైనా చూసుకో వచ్చు."

రంగయ్య శేఖరం మాటల్ని శ్రద్ధగా వినటం లేదు. సంధ్య కాంతిలో వింతగా మెరుస్తున్న పాము శరీరాన్ని పరీక్షగా చూస్తున్నాడు.

"నాగుపాము లాగుంది, బాబుగారూ. చూస్తే మరి తిరుగు లేదు" అన్నాడు.

రంగయ్య మాటలకి నవ్వి, "నాగుపాము లాగ ఉండటమేమిటి? నాగుపామే. కర్ర దెబ్బ బలంగా పడగానే బుస్సున పడగెత్తింది. సరిగ్గా గురి కుదిరిం దనుకో. తీసి అవతల పారెయ్యి" అంటూ శేఖరం వెనక్కి తిరిగి లాన్‌లో నించి ఇంటి వేపు నడిచాడు.

రంగయ్య పాముని పారెయ్యకుండా, అక్కడే ఎండు పుల్లల్ని ఏరి, దాన్ని దహనం చేసే ప్రయత్నంలో పడ్డాడు. వరండాలోని కుర్చీలో భర్తకి ఎదురుగా పాలిపోయిన మొహంతో కూర్చుంది లలిత.

"నువ్వు పాముని చంపకూడదని కోయ దొర చెప్పిన మాటలు మరిచి పోయావా, రాజా?" అంది లలిత మనసులోని ఆందోళనని అణుచుకోవడానికి ప్రయత్నిస్తూ. పాముని తగలబెడుతున్న రంగయ్య మీది నుంచి శేఖరం దృష్టిని భార్య వైపు తిప్పి ఆశ్చర్యంగా చూశాడు.

"కోయ దొరా? ఎప్పుడు?" అన్నాడు.

"మన పెళ్ళయిన కొత్తలో ఒక రోజు ఇలాగే సాయంత్రం వేళ వరండాలో కూర్చుంటే ఒక కొండ దొర వచ్చి చెయ్యి చూస్తానని బలవంతం చెయ్యలే?. . ."

"ఆఁ. ఆఁ. జ్ఞాపకం వచ్చింది. నా చేతి రేఖల్లో నాగదోషమో ఏదో ఉందన్నాడు. పోనీ! పొట్ట కూటి కోసం వాడేదో వాగాడు. అదంతా మనసుకి పెట్టుకుని కూర్చున్నావా ఇంకా?" శేఖరం నవ్వాడు. లలితకి కాస్త సిగ్గనిపించింది. లలిత, శేఖరం ఇద్దరూ బాగా చదువుకున్న వాళ్ళు. లలిత ఫిజిక్స్‌లో పిహెచ్.డి. చేసి యూనివర్సిటీలో లెక్చరర్‌గా పని చేస్తోంది. శేఖరం ఫారిన్ రిటర్న్డ్ ఇంజనీరు. పై సంఘటన జరిగే నాటికి లలిత మూడు నెలల గర్భవతి.

• • •

"సారీ, రాజా!" అంది నెమ్మదిగా లలిత. ఆమె కళ్ళలో నిండిన నీరు కణతల మీదుగా జారి తలగడని తడుపుతోంది. శేఖరం గబుక్కున వంగి భార్య కన్నీళ్ళు తుడుస్తూ, "ఛా! ఏమిటా ఏడుపు? ఇప్పుడేమైందని? మన కింక పిల్లలే పుట్టరా? నువ్వు దక్కావు. నా కంతే చాలు, లలితా!" అన్నాడు.

లలిత తేరుకుంది.

"ఆడపిల్లట కదా? నువ్వు చూశావా? నే నెంత అడిగినా నర్సు నాకు చూపించటానికి ఒప్పుకోలేదు" అంది భర్తతో లలిత. పిల్ల మాట వినగానే శేఖరం మొహం గంభీరంగా మారిపోయింది.


"ఆఁ! చూశాను. అయినా చనిపోయిన పిల్లని చూసినమాత్రం ఏం లాభం చెప్పు? నువ్వు అనవసరంగా ఆలోచించకుండా విశ్రాంతి తీసుకోవాలి" అన్నాడు అనునయంగా శేఖరం. లలిత క్షణంసేపు ఊరుకుని, "నువ్వా రోజు ఆ పాముని చంపకుండా ఉంటే!" అంది నెమ్మదిగా. రాజశేఖరం గుండెలు ఝల్లుమన్నాయి. భార్యకి సంగతి తెలిసిపోలేదుగదా అనుకుంటూ, "ఇంత చదువుకున్నదానివి, నువ్వే ఇలాంటి సెంటిమెంట్లు పెట్టుకుంటే ఎలా లలితా? నేను పాముని చంపడానికీ, దీనికీ సంబంధం ఏమిటి, చెప్పు? కాన్పు కష్టమైంది కాబట్టి పిల్ల దక్క లేదు. నువ్వు పిచ్చి పిచ్చి ఆలోచనలతో మనస్సు, ఆరోగ్యం పాడుచేసుకోకు. నా మాట విని ఆ పాము

సంగతి మరిచిపో!" అన్నాడు బతిమాలుతున్నట్టుగా. లలిత మరి మాట్లాడలేదు. భార్య పక్కనే మౌనంగా కూర్చుని ఉన్న శేఖరం నించి భారమైన నిట్టూర్పొకటి వెలువడింది. జేబులో నించి సిగరెట్ తీసి వెలిగించుకున్నాడు.

"ఇక్కడ స్మోక్ చెయ్యకూడదండి!" లలితకి ఇంజెక్షన్ ఇవ్వడానికి అప్పుడే లోపలికి వస్తున్న నర్సు హెచ్చరించింది. "సారీ!" అంటూ లేచి వరండాలోకి వచ్చి నిల్చున్నాడు. శేఖరానికి కొంచెం దూరంలో అయిదారుగురు ఆడవాళ్ళు, ఇతర పేషెంట్ల తాలూకు వాళ్ళు గుంపుగా నిల్చుని హాస్పిటల్ ఆయా చేతిలోని గుడ్డ మూట లాంటి దాన్ని వింతగా, కుతూహలంగా చూస్తున్నారు. శేఖరం దృష్టి అటు పడగానే, శేఖరానికి ఆయా చేతి లోని దేమిటో అర్థమై, అతని మొహమంతా కోపంతో జేవురించింది. ఆయా తనవైపు రాగానే, "ఇలా అందరికీ ప్రదర్శిస్తూ తీసుకెళ్ళమని చెప్పారా నీకు?" అడిగేడు సూటిగా ఆయావైపు చూస్తూ. అనుకోని ప్రశ్నకి బెదిరి తడబడింది ఆయా! కాని వెంటనే కోలుకొని, "అదేమిటండీ! అలా అంటారు? మామూలు పిల్లయితే ఎవరు చూస్తారండీ? వింతంటే జనం విరగబడతారు. నా తప్పేముందండీ? అళ్ళు చూపించంటే చూపి స్తున్నాను" అంది కాస్త గట్టిగానే. శేఖరానికి ఆయా చెంప పగలగొడదా మనిపించినా, గొడవైతే లలితకి తెలుస్తుం దని కోపాన్ని నిగ్రహించుకున్నాడు.

"అనవసరంగా వాదించకు! అలా వూరేగిస్తూ తీసుకెళ్ళడం నా కిష్టం లేదు. రెండో కంటికి తె కుండా తీసుకుపో!" అంటూ జేబులోనించి అయిదు రూపాయల నోటు తీసిచ్చాడు. ఆయా మొహం చాటంతైంది.

"తెల్లారకుండా తీసి కెళ్ళిపోవా లనుకున్నా నండీ. మరి కుదిరింది కాదు." అంటూ పసిపాప మృత దేహాన్ని చుట్టి ఉన్న గుడ్డ సర్దుతూ వెళ్ళి పోయింది. రాజశేఖరం అయిపోయిన సిగరెట్టుతోనే మరో సిగరెట్టు వెలిగించుకుని వరండా పిట్టగోడని ఆనుకుని నిలుచున్నాడు. లాన్‌లోని పచ్చ గడ్డిమీద మెరుస్తున్న మంచు బిందువుల్ని కరిగిస్తూ నీరెండ ఎగబాకు తోంది. చల్లని ప్రాతఃకాలపు గాలి ఆలోచనలతో వేడెక్కి ఉన్న అతని నుదుటిని మృదువుగా స్పృశిస్తూ, సేద దీరుస్తోంది. నర్సింగ్ హోమ్ ఆవరణలో కార్లు వచ్చి ఆగుతున్నాయి. పేషంట్ల తాలూకు బంధువులు కాఫీలు, టిఫిన్లు పట్టుకు దిగుతున్నారు. రాత్రి డ్యూటీ చేసిన నర్సులు వెళ్ళిపోతున్నారు. పగటి డ్యూటీ వాళ్ళు ఫ్రెష్‌గా, చిరు నవ్వులతో పేషంట్లని వాళ్ళ బంధువుల్ని పలకరిస్తూ తిరుగుతున్నారు. ఒక పెద్ద కారు వచ్చి పోర్టికోలో ఆగింది. అందులో నించి నొప్పులు పడుతున్న స్త్రీ ఒకామె దిగింది. ఆమె తోటి ఆడవాళ్ళు ఆమెని కన్సల్టింగ్ రూమ్ వైపు నడిపించుకు పోతున్నారు. రాజశేఖరానికి క్రితం రాత్రి తను లలితని ఆస్పత్రికి తీసుకు రావడం, ఆమెని లోపలికి తీసుకు వెళ్ళగానే సగం ఆందోళన తోనూ, సగం ఆత్రత తోనూ సంతోష వార్త వినడానికి అక్కడే లౌంజ్‌లో సోఫాలో ఇంచుమించు



అమ్మనీడలో

చిత్రం — గోలి శంకరరావు ( హైదరాబాద్ )

అర్ధ రాత్రి దాకా కూర్చోవడం జ్ఞాపకానికి వచ్చింది. లలిత సహజంగా చాలా ఆరోగ్యవంతు రాలు. డాక్టర్‌కూడా డెలివరీ సులభంగానే అవవచ్చని చెప్పింది. అందుకే దీమాగా, కాన్ఫిడెన్స్‌తో శుభవార్త కోసం ఎదురు చూశా డతను. కాని జరిగిందేమిటి? చనిపోయి పుట్టిన పిల్ల రూపం జ్ఞాపకానికి వచ్చి శేఖరం శరీరం జుగుప్సతో, భయంతో గగుర్పొడి చింది! సగం మానవ శరీరం, సగం సర్పం లాంటి రూపం. మై గాడ్! నర్సు తెల్లని బేసిన్‌లో పెట్టి తీసుకు వచ్చి చూపించిన ఆ 'ఫ్రీక్ బేబీ' భయం కరంగా ఉంది. మొహం మామూలుగా ఉన్నా ఆ మొహాన్ని కప్పుతూ పాము పడగలాంటి చర్మం తల మీద నుంచి ఉంది. అందంగా ఉన్న ఆ మొహాన్ని చూడాలంటే, సగం మొహాన్ని కప్పు తున్న ఆ పడగ లాంటి దాన్ని చేత్తో వెనక్కి నెట్టాలి. మోకాళ్ళ దాకా సహజంగా ఉన్న వాళ్ళు, మోకాళ్ళ కింది నించీ రెండూ కలిసిపోయి పాము తోకని జ్ఞప్తికి తెచ్చాయి. చేతులు అసలు లేనేలేవు. లలిత గర్భవతిగా ఉన్నప్పుడు తను పాముని చంపడం చేతే అలాంటి పిల్ల పుట్టిందా? నిజంగా పాములు శపి స్తాయా? సైన్సుకి, విజ్ఞానానికి అందని వింతలు ఇంకా ఉన్నాయా? శేఖరం ఆలోచనలకి అంతు లేదు. రెండో సిగరెట్టు పూర్తిచేసి వరండాలో నించి లలిత దగ్గరికి వెళ్ళాడు. లలిత ఇంజక్షన్ ప్రభావంతో నిద్ర పోతూంది. ఆమెకి నిద్రా భంగం చెయ్యకుండా చిన్న చీటీమీద, "లలితా. నేను ఇంటికి వెళ్ళుతున్నాను. స్నానం అదీ చేసి, అలా సుధ దగ్గిరికి వెళ్ళి, మళ్ళీ సాయంత్రం వస్తాను—రాజా" అని రాసి, మంచం పక్కనున్న సెల్ఫ్ మీద మందు బాటిల్ కింద పెట్టి నిశ్శబ్దంగా బయటికి నడిచాడు శేఖరం.

• • •

"కమిన్" అన్న పిలుపు విని కన్సల్టింగ్ రూమ్ తలుపు తోసుకుని లోపలికి వెళ్ళాడు రాజశేఖరం. టేబిల్ మీదున్న కాగితాల్ని సర్దుతూ నిలుచుని ఉన్న డాక్టర్ సుధ తలెత్తి చూసి, "నువ్వా? లలిత ఎలా ఉంది? డెలివరీ అయిందా? భోజనం చేసి నర్సింగ్ హోమ్‌కి వద్దామనుకుంటు న్నాను. ఇంకా" అంది టేబిల్ సర్దటం ఆపి తన కుర్చీలో కూర్చుంటూ, శేఖరం టేబిల్‌కి మరో వైపు ఉన్న కుర్చీ లాక్కుని కూర్చున్నాడు.

"ఈ రోజు తెల్లారిగట్ల డెలివరీ అయింది..." అంటున్న శేఖరం మాట పూర్తవకుండానే సుధ ఆత్రతగా, "ఆడపిల్లా? మగపిల్లాడా?" అనడిగింది. శేఖరం ఆమె మాటలకు జవాబు చెప్పకుండా, "నీతో ఏకాంతంగా మాట్లాడదామని వచ్చాను, సుధా" అన్నాడు.

శేఖరం తన ప్రశ్నకి సమాధానం ఇవ్వకపోవడం గమనించిన సుధ ఏదో జరగకూడనిదే జరిగిందను కుని మరి ఆట్టే రెట్టించకుండా, "పద, ఇంటికి వెళదాం. భోజనం చేస్తూ మాట్లాడుకోవచ్చు. లలిత కులాసాగా ఉందిగా?" అంది కుర్చీలోంచి లేవ బోతూ.

"లలిత కులాసాగానే ఉంది. నా భోజనం హోటల్లో అయిపోయింది. ఆట్టే సేపు నిన్ను ఆట్టే పెట్టను. పదిహేను నిమిషాలు నా కోసం నీ భోజనం వాయిదా వెయ్యి. ఈ విషయం పిన్నీ వాళ్ళ ముందు మాట్లాడటం నాకు ఇష్టం లేదు." శేఖరం అలా అనగానే సుధ మళ్ళీ కుర్చీలో కూర్చుండిపోయింది. సుధ శేఖరానికి దూరపు బంధువు. రెండేళ్ళ క్రితమే ఎమ్. బి. బి. ఎస్. పూర్తిచేసి ప్రైవేట్‌గా ప్రాక్టీస్ పెట్టుకుంది. వాళ్ళ మధ్య బంధుత్వం కన్నా స్నేహమే ఎక్కువ. లలిత గర్భవతి అని తెలిసిన నాటి నించీ డాక్టర్‌గా ఆమె ఆరోగ్యం విషయంలో తనకి తోచిన సలహా లిస్తూ ఉండేది సుధ. లలితని ఫలాని నర్సింగ్ హోమ్‌లో చేర్పించమని సలహా ఇచ్చింది కూడా ఆమే. లలితని నర్సింగ్ హోమ్‌లో చేర్పించ డానికి తీసుకు వెళ్ళే ముందు శేఖర్ సుధకి ఫోన్‌చేసి చెప్పాడు. లలిత ఎలా ఉందో అనిపించినా ఆ రోజు సుధకి తీరిక లేక నర్సింగ్ హోమ్‌కి వెళ్ళలేకపోయింది. మధ్యాహ్నం భోజనం అయ్యాక వెళ్ళొచ్చులే అను కుంటూ ఉండగానే శేఖరం అక్కడికి వచ్చాడు. 'బహుశా కానుపు కష్టమై పిల్ల దక్కి ఉండదు. అందుకే శేఖర్ అంత అప్‌సెట్ అయి ఉన్నాడు' అనుకుంటూ, "చెప్పు, ఏమిటి సంగతి?" అంది.

శేఖరంసిగరెట్ వెలిగించుకుంటూ, "సుధా, పాములు శాపం పెడతాయంటే నువ్వు నమ్ముతావా?" అనడిగేడు. సుధ అలాంటి సంభాషణని ఎదురుచూసి

ఉండకపోవడంవల్ల, "వాట్?" అంది అయోమయంగా.

"లలితకి 'ఫ్రీక్ బేబీ' పుట్టింది. అవేకోర్స్ ప్రశ్నం లేకుండానే పుట్టిందనుకో! ఆ సందర్భంగానే నిన్ను అడుగుతున్నాను, పాములు శాపం పెడతాయంటే నువ్వు నమ్ముతావా?"

"నాన్సెన్స్! నేను నమ్మను." దృఢంగా అంది సుధ.

"నాకూ అలాంటి నమ్మకాలు లేవుగానీ, ఎందుకు ఇలా జరిగిందా అని కొట్టుకు చస్తున్నాను" అంటూ కొండ దొర తన చెంప్యు చూడటం దగ్గర్నుంచీ జరిగిన సంగతులన్నీ వివరంగా చెప్పాడు. పుట్టిన పిల్ల రూపాన్ని వర్ణించి చెప్పగానే సుధ ఆశ్చర్యపోయింది.

"మై గాడ్! కానీ ఈ విషయాలు, అదే కొండ దొర జ్యోతిష్యం గురించి, నువ్వు పాముని చంపడం గురించి నువ్వుగానీ, లలిత గానీ నా కెప్పుడూ చెప్పలేదే?" అంది.

"అప్పట్లో నేను ఆ విషయాన్ని అంత సీరియస్‌గా తీసుకోలేదు. వాలాగే నువ్వు వేళాకోళం చేస్తావేమోనన్న భయంతో లలిత గూడా నీ దగ్గర ఆ సంగతి ఎత్తి ఉండదు. పాముని చంపిన కొత్తలో మాత్రం లలిత అస్తమానం తనకి పాములు కలల్లోకి వస్తున్నాయనీ, తనను ఒక పెద్ద పాము తన శరీరాన్ని చుట్టుకున్నట్టు కల వస్తూండని చెప్పేది. నేను సీరియస్‌గా ఆలోచించ వలసిన అవసరం లేకపోయింది. నా మాటలకి నిర్విణ్ణురాలైన లలిత ఆ తర్వాత ఆ సంగతి నా దగ్గర ఎత్తడం మానేసింది. ఇంతజరిగాక, నాకూ ఇప్పుడు అనుమానంవస్తోంది, నేను పాముని చంపడంచేతే అలాంటి పిల్ల పుట్టిందా అని. డాక్టర్‌వి కదా, ఈ విషయంలో నువ్వేం చెప్తావో వినుకున్దామని వచ్చేను" అన్నాడు.

"సాధారణంగా ఫ్రీక్ బేబీస్ తల్లి మానసిక అనారోగ్య కారణంగానే పుడుతూ ఉంటాయి. నే నొక రోగ్య కారణంగానే ... ఒక బ్రిటిష్ జర్నల్‌లో చదివిన సంఘటన చెప్తాను. ఒక వనిత గర్భవతిగా ఉన్నప్పుడు తరచు తన బెడ్‌కి ఎదురుగా ఉన్న నీగ్రో చిత్రాన్ని చూస్తూ ఉండేదట. అస్తమానం దాన్నే చూస్తూ, దాన్ని గురించి ఆలోచిస్తూ ఉండటం చేత ఆమెకి కలిగిన శిశువు మొహం పోలికలు ఆ చిత్రంలోని నీగ్రో పోలికలతో పుట్టడం జరిగి, భర్త విడాకు లిచ్చే దాకా విషయం వెళ్ళిందట. దీన్నిబట్టి తల్లి ఆలోచనలు, మానసిక మైన ఆందోళన గర్భంలోని శిశువు పెరుగుదల మీద ఎలాంటి ప్రభావాన్ని చూపిస్తాయో తెలుస్తుంది. లలిత విషయంలో ఇలా జరిగి ఉండటానికి అవకాశం ఉంది. నువ్వు నమ్మక పోయినా, లలిత కొండదొర జ్యోతిషాన్ని పూర్తిగా నమ్మింది. కొంత మంది ఎంత చదువుకున్నా, ఎన్ని దేశాలు తిరిగినా, సెంటిమెంట్స్‌ని, మూఢనమ్మకాల్ని వదలిపెట్ట లేరు. లలిత ఆ కోవకి చెందిన వ్యక్తే నువ్వు. పాముని చంపడంతో లలిత విపరీతమైన మానసిక ఆందోళనకి గురి అయింది. నువ్వు లలిత శారీరక, ఆరోగ్య విషయంలో శ్రద్ధ తీసుకున్నావు గానీ, ఆమె మనసులోని కల్లోలాన్ని అర్థం చేసుకోలేక పోయావు. తన మనసులోని భయాందోళనలని, విద్యాధికురాలైన లలిత పరాయి వాళ్ళ దగ్గర వ్యక్తం చెయ్యడానికి సిగ్గుపడి ఉండొచ్చు. సదా ఆ విషయాన్ని గురించే తనలో తనే ఆలోచిస్తూ ఉండటం చేత ఆమెకి భయంకరమైన కలలు వచ్చేవి. ఆ ఆలోచనలూ, మనసులోని భయాందోళనల ప్రభావం వల్ల గర్భంలోని శిశువు ఆ రూపాన్ని దిద్దుకొని ఉండవచ్చు. జరిగిపోయినదాన్ని గురించి చర్చించి లాభం లేదు. ముందు జరగబోయే విషయాన్ని గురించి మనం జాగ్రత్త పడాలి." సుధ ఆగింది. శ్రద్ధగా ఆమె మాటల్ని వింటున్న శేఖరం "అంటే?" అన్నాడు.

"నువ్వు ఈ విషయాన్ని ఎంత రహస్యంగా ఉంచినా, ఏ హాస్పిటల్ ఆయా ద్వారానో, నర్సుద్వారానో లలితకి తనకి పుట్టిన పిల్ల గురించి తెలియక తప్పదు. దానివల్ల తను మరింత మనసు పాడుచేసుకుంటుంది. మళ్ళీ గర్భవతి అయినప్పుడు ఈ విషయాన్నే మనసులో మననం చేసుకుంటూ ఉండటం చేతా, భయంచేతా మళ్ళీ లోపాలతో పిల్లలు కలిగే అవకాశం ఉంది."

"ఓ గాడ్! నే నీ సంగతి ఆలోచించనేలేదు. తనకి ఎలా చెప్పాలో తోచటం లేదు, సుధా! ఇవింత ఫూలిష్‌గా ఆలోచిస్తుందని నే ననుకోలేదు."

"అది ఫూలిష్‌నెస్ కాదు. కొందరి స్వభావం అంతే. మాటలతో లలితకి మనం ప్రస్తుతం ఎన్ని చెప్పినా లాభం ఉండదు. ఇప్పటికి పూరుకున్నా మళ్ళీ గర్భవతి అయినప్పుడు తనలో సందేహాలు, భయాలు తలెత్తక మానవు." శేఖరం అలసటగా నుదుటి మీద చెయ్యి ఆనించుకుంటూ, "ఇప్పుడేం చెయ్యడం సుధా?" అన్నాడు.

"నాగ ప్రతిష్ఠ చేయించు" అంది సుధ. సీరియస్‌గా ఉన్న ఆమె మొహాన్ని చూసి నవ్వుతూ,

"తమాషాకి కాదు. సీరియస్‌గానే చెప్తున్నాను. లలిత మనసులోని సందేహాలూ, అనుమానాలూ తీరిపోవాలంటే అదే దారి. నువ్వు పాముని చంపిన పాపం అలా పరిహారం అయిపోయిందని తను తృప్తి పడుతుంది. అసలు అలా ఏర్పాటు చేసినదే ఇవన్నీనూ. కాబట్టి తిన్నగా వెళ్ళి పురోహితుణ్ణి కన్సల్ట్ చెయ్యి" అంది సుధ.

శేఖరం కుర్చీలోనించి లేస్తూ, "తప్పదా?" అన్నాడు.

"తప్పదు. పరిస్థితుల కనుగుణంగా నడుచుకోవటం తెలివైన వాళ్ళు చేసే పని. ఇందులో నీ కొచ్చే నష్టమేమీ లేదు. ఎటొచ్చీ నువ్వు మనస్ఫూర్తిగా చేస్తున్నట్టు లలితని నమ్మించాలి." కన్సల్టింగ్ రూమ్ తాళం వేస్తూ అంది.

• • •

రెండేళ్ళ తర్వాత ఒక సాయంత్రం వేళ సుధ తన కన్సల్టింగ్ రూమ్‌లో పేషెంట్స్‌తో బిజీగా ఉన్నప్పుడు శేఖర్ ఫోన్‌చేసి, "లలితకి మగపిల్లాడు పుట్టాడు, సుధా. నాలుగు కేజీల బరువుతో చాలా హెల్తీగా, అందంగా ఉన్నాడు. నీ సలహా బాగా పని చేసింది. చాలా థాంక్స్. నేను బాబుకి సుధాకర్ అని పేరు పెడదామనుకుంటే, లలిత 'ఫణీంద్ర' అని పేరు పెట్టాలంటోంది" అని చెప్పాడు ఆనందంగా. *

దీర్ఘ వ్యాధులకు ఉత్తమసిద్ధవైద్యం!

నరముల బలహీనత
ధాతుపుష్టి యవ్వనశక్తి
హెర్నియా వర్షవ్యాధులకు
పోస్ట్ ద్వారా కూడా కలడు
పరిజాజం (బుడ్డ)
మూత్రవ్యాధులకు
ఆపరేషన్ లేకుండా రండి
డా॥ దేవర, ఫోన్: 551, మార్కెట్ సెంటర్, తెనాలి.
బ్రాంచి: 26, నార్త్ బోగ్ రోడ్, మద్రాసు—17

చదవండి! చదివించండి!!
బాలభారతి
ఎక్కువ పేజీలు, అనుబంధ నవల
కలిగిన పిల్లల మాస పత్రిక. వెల రూ.1·25
సంపాదకుడు: వి.వి. నరసింహారావు
సహకార సంపాదకుడు: శశిభూషణ్
ఏజన్సీ వివరాలకు:
బాలభారతి
పో.బా.నెం 2645, మద్రాసు-600024

దేహపుష్టికి ఆరోగ్యానికి
పండిట్ డి. గోపాలాచార్యులవారి
జీవామృతం
1898 నుండి ప్రసిద్ధి గాంచినది.
ఆయుర్వేదాశ్రమం
(ప్రైవేట్) లిమిటెడ్
మదరాసు-17

ఉచితం ఉచితం !!
తెల్లమచ్చలు
అన్ని రకాల మచ్చలను, ఎరుపు రంగును మా ప్రఖ్యాత మందు అయిదు రోజులలో మార్చును. త్వరలోనే చర్మము సామాన్యపు రంగు పొందును. ప్రచారము నిమిత్తము: ఒక సీసా మందు ఉచితంగా పంపబడును. వెంటనే వ్రాయుండి. వివరాలకు:
BHARAT AYURVEDASHRAM,
P.O. Katri Sarai (Gaya)